www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 7 డిసెంబర్ 2024
5
అన్నమయ్య

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించిన ఫార్మసీ విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇటీవల నరసరావుపేట ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించారని కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి తెలిపారు. ఫార్మసీ విద్యార్థులు జి.వంశీ, ఎస్.యువరాజ్, సంజీవ, జి.వెంకట పవన్, హుస్సేన్, అక్బర్ వల్లి, ఎం.మహేష్ బాబు, డి.గణేష్, టి.వినోద్ కుమార్, సాయి మేఘనాథ్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారన్నారు. పరుగు పందెంలో డి.గణేష్ ప్రథమ బహుమతి, లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. కళాశాల క్రీడా ఇన్‌ఛార్జి మధు, అశోక్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.


క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

భూ సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంబేపల్లి మండలం మోటకట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సును మంత్రి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 90 శాతానికి పైగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఎ, డీకేటీ, రీ సర్వే ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేసి రైతులకు మేలు చేశారని చెప్పారు. అధికారులు రెవెన్యూ సదస్సుల్లో భాగస్వాములై ప్రత్యేక శ్రద్ధతో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇకనుంచి భూ బాధితులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను వీలైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల గురించి చాలామందికి తెలియదని ఈ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించి భూ సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చునని వారికి అవగాహన కల్పించాలన్నారు. మీ భూమి- మీ హక్కు డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు 33 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గ్రామస్థాయిలో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ప్రభుత్వ దృష్టి సారించి రెవెన్యూ సదస్సు నిర్వహణకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. 2025 జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఉంటుందని ఈ కార్యక్రమంలో భూ సమస్యలన్నీ పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఇకనుంచి భూ సమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్య ను పరిష్కరించాలన్నదే మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

'ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు'

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలపై అన్యాయంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయాలపై రాజ్యాంగ విలువలు, హక్కులను కాపాడేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. సమాజంలో ఏమి జరుగుతోంది ఎటువంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి అనే కేసుల పరిస్థితి తదితరాలపై కూడా కమిటీ సభ్యులు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వంలో జరిగినట్లు ఈ ప్రభుత్వంలో ఎవరిపైనా ఎటువంటి దాడులు జరగవన్నారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలను రూ.3.60 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. వసతి గృహాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నాకపిన్స్ ఇస్తామన్నారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రామాలకు స్వచ్ఛమైన శుద్ధి జలాలు ప్రజలకు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసుకోకుండా చూడాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో శ్మశాన వాటికల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈ సమస్య తిరిగి పునరావృతం కాకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

దాడుల గురించి వివరాలు అడుగుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : ఎఎస్‌పి

బహుమతులు పొందిన హోంగార్డులతో ఎఎస్‌పి వెంకటాద్రి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎఎస్‌పి (అడ్మిన్) వెంకటాద్రి అన్నారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. హోంగార్డుల నుంచి ఎఎస్‌పి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులతో సమానంగా హోం గార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి టెక్నికల్, సిసిటిఎన్ఎస్, కోర్టు డ్యూటీలు, కంప్యూటర్ విధులు, అన్ని బందోబస్తు విధులలో బాగా పని చేస్తున్నారన్నారు. సాధారణ డ్యూటీల మొదలు క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పని చేస్తున్నారని చెప్పారు. సమాజసేవలో, శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు పోలీసులతో సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలి, పారదర్శకంగా, నిజాయితీగా పని చేయాలని, నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. హోంగార్డు రైజింగ్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీలలో గెలుపొందిన హోంగార్డు సిబ్బంది విజేతలకు బహుమతులు, విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన హెూంగార్డ్స్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. హోంగార్డ్స్ పరేడ్ కమాండర్‌గా ఎస్ఎండి తాహీర్ బాషా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి చిన్నికృష్ణ, ఎఒ బి.కృష్ణుడు, ఎస్‌బి సిఐ ఎ.సత్యనారాయణ, రిజర్వ్ సిఐలు వి.జె.రామకృష్ణ, టి.జాన్ జోసఫ్, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- జెసికి విద్యార్థి సంఘాల నాయకులు వినతి

జెసికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని అన్నమాచార్య యూనివర్సిటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆకేపాడు క్రాస్ రోడ్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జెసి ఆదర్శ రాజేంద్రన్‌కు విద్యార్థి సంఘాలు నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర మాట్లాడుతూ ప్రయివేట్ యూనివర్సిటీ సెక్షన్ 44 క్రింద ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఆర్థిక అవకతకలకు పాల్పడుతున్న ప్రస్తుత అన్నమాచార్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ పరిపాలనలో అనేక అక్రమాలకు పాల్పడుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన దానికన్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్లేస్మెంట్ ట్రైనింగ్ పేరుతో ఉచితంగా అందించాల్సిన ట్రైనింగ్‌కు రూ.15 వేలు వసూలు చేస్తున్నారాని, ఎటువంటి రసీదు ఇవ్వకుండా కళాశాల ప్లేస్మెంట్ ట్రైనింగ్ అధికారి కె.శ్రీనివాసరావుకు ఫోన్‌పే ద్వారా పంపాలని విద్యార్థులను ఒత్తిడి చేసి విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా కళాశాల యాజమాన్యం పిటిఒ శ్రీనివాస్ రావును సస్పెండ్ చేసి విద్యార్థులను మరల ట్రైనింగ్ ఫీజు కట్టాలని వేధిస్తున్నారని ఆరోపించారు. అలా కట్టని యెడల విద్యార్థులకు హాల్ టికెట్లు, ఇంటర్నల్ మార్కులు ఇవ్వమంటూ పరీక్షలకు హాజరు కానివ్వమని విద్యార్థులను భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. విద్యార్థులతో అమానుషంగా ప్రవర్తిస్తున్న అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ను యాజమాన్య బాద్యతల నుండి తొలగించి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో గతంలో యాజమాన్యం ఒత్తిళ్ల తట్టుకోలేక అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. కళాశాలకు సంబంధించిన వసతి గదులకు ఒక్కో విద్యార్థి నుంచి దాదాపుగా రూ.80 వేలు వసూలు చేస్తున్నారన్నారు. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ లో జరుగుతున్న అవకతవకలపై ఏసీబీ మరియు సిఐడి అధికారులచే విచారణ జరిపించాని, విద్యార్థుల నుంచి వసూలు చేసిన రూ.2.80 కోట్లు ఫీజులను తిరిగి విద్యార్థులకు కలాశాల ఫీజులో తగ్గించాలని కోరారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న వ్యక్తులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో గతంలో జరిగిన ఆత్మహత్యలన్నిటిపై సమగ్ర విచారణ సిట్టింగ్ జడ్జితో జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, సాయి చరణ్, శివశంకర్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు రామ్ చరణ్, వెంకట మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జిఒ145ను తక్షణం రద్దు చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి : రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న మొదటి తరగతి జిల్లా కోర్టులలో ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం జరగవలసిన క్రిమినల్ కేసులు జరిగే అవకాశం లేకుండా తీసుకొచ్చిన జిఒ145ను తక్షణ రద్దు చేయాలని కోర్టు విధులను బహి ష్కరించి రాయచోటి కోర్టు ఎదుట న్యాయవాదులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిఒ 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాలలో కూడా భవిష్యత్తులో ఎన్‌డిపిఎస్ ఆక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాలలో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తానికి తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉంటుందని కోస్తా ప్రాంతంలో నాలుగు కోర్టులు మాత్రమే పనిచేస్తాయని దీనివలన కసిదారులు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేసి వారికి ఆర్థిక భారం పెరిగిపోయే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కేసులు సంఖ్య విపరీతంగా పెరిగి పోతున్నప్పటికీ అదే తరహాలో కోర్టుల సంఖ్య పెరగవలసి ఉండగా మన ప్రభుత్వాలు మాత్రం కోర్టుల సంఖ్యను తగ్గిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం లేకుండా కక్ష దారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారన్నారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎంత మొత్తుకున్నప్పటికీ ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా జిఒ145 లాంటివి తెచ్చి ప్రజలకు న్యాయవ్యవస్థలం దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఈశ్వర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ కుమార్, రాజమనోహర్, ధనుంజయ్ కుమార్, రామాంజులు, రవిశంకర్, తాహిర్, నాగమల్లు, వీరభద్రయ్య, కుసుమ, వరలక్ష్మి, ఖాదర్ బి, సయ్యద్ బాషా, ఇలియాస్ భాష పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రాయచోటి : మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేయడం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఎంపిడిఒ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిపి రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అధికారులతో కలసి పనిచే యాలన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారం అభివృద్ధి అంశాలలో అధికారులకు ప్రజాప్రతినిధులు తమవంతు సహాయ, సహకారాలు అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పిఆర్ ఎఇ సందీప్ మాట్లాడుతూ రూ.80 లక్షలతో చెన్నిముక్కపల్లె గ్రామం దూళ్ళవారిపల్లె వంకకు అడ్డంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను త్వరలోనే పూర్తవుతాయన్నారు. శిబ్యాల-మోపురంపల్లె తారురోడ్డు నిర్మా ణం పనులు డిసెంబరు నెలారులోపు పూర్తిచేయించనున్నట్లు తెలిపారు.ఎంఇఒ-2 శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనాన్ని సక్రమంగా అందిస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి దివాకర్ మాట్లాడుతూ రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఎక్కువగా ఉలవపంటను సాగు చేశారన్నారు. రాయచోటిని కరువు మండలంగా ప్రకటించినందున మండలంలో 345 హెక్టార్లలో రూ.58.71 లక్షల పంటనష్టం జరిగినట్లు నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అనంతరం హౌసింగ్, ఐసిడిఎస్, ఆర్డబ్ల్యుఎస్, ఆర్టీసి, వైద్య ఆరోగ్యశాఖతో పాటు పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి ఘటనలో

హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ అహ్మద్, మరో ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డిలను సస్పెండ్ చేస్తూ డిఇఒ సుబ్రహ్మణ్యం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆర్‌జెడి శ్యాముల్ ఆదేశాల మేరకు వారిద్దరిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల నాలుగో తేదీన ఉర్దూ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉపాధ్యాయుడు ఏజాస్ అహ్మద్‌పై దాడి సంఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారుల కమిటీ విచారణ చేపట్టిందన్నారు. విచారణ ఆధారంగా దాడి జరిగిన సమ యంలో తరగతి గదిలో ఉండాల్సిన వెంకటరామిరెడ్డి అక్కడ లేకపోవడంతోనే ఈ సంఘటన చోటుచేసుకుందని విచారణలో తెలిందన్నారు. సంఘటన విషయంలో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ అహ్మద్ పైన కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విచారణపై మరింత విశ్లేషణ చేసి తదుపరి చర్యలు ఉండవచ్చని తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా వాల్మీకిపురం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమీపంలోని సచివాలయం 3లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ మనోహర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం 3లోని ఆధార్ కేంద్రంలో పేరులో మార్పులు చేర్పులు, పుట్టిన తేదీ, ఫొటో, సెల్ నెంబరు, అడ్రస్సు వంటివి మార్పులు చేసుకొనవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆధార్ సేవలను పొందాలని సుచించారు.

గిరిజన పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో రద్దయిన 18 గిరిజన సంక్షేమ పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం సమర్పించినట్లు గిరిజన ముద్దుబిడ్డ మూడే హరి చౌహాన్ నాయక్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రాజధానిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎంను కలిసి గిరిజన సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలో గిరిజన భవనం నిర్మించాలని, గతంలో నిలిపిన గిరిజనుల 18 పథకాలను మళ్లీ కొనసాగించాలని, గిరిజన కార్పొరేషన్ ను మరింత ముందుకు తీసుకెళ్లాలని, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమ, ఉన్నతి కోసం పథకాలను మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. గిరిపుత్రిక కార్పొరేషన్ల ద్వారా గిరిజనులకు రాయితీ రుణాలను అందజేయాలని కూడా ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు.

సిఎంకు వినతిపత్రం ఇస్తున్న హరి

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య

స్కానింగ్ సెంటర్లకు అనుమతి తప్పనిసరి

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కొత్తగా ఏర్పాటు చేసిన స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో అవగాహన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్నా స్కానింగ్ సెంటర్ లు తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పునరుద్దరణ చేసుకోవాలని కోరారు. స్కానింగ్ సెంటర్లను అధికారులు కచ్చితంగా తనిఖీలు చేపట్టాలని, లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజల్లో విస్తృతంగా ఐసిడిఎస్, మహిళా సంఘాలు, పోలీసుల సహకారంతో అవగాహన కల్పించాలని కోరారు. లింగా నిర్ధారణ పరీక్షలు చేసిన చేయించాలని ప్రోత్సహించిన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులకు మొదటిసారి పదివేల జరిమానా మూడు సంవత్సరాల జైలు శిక్ష, రెండవసారి చట్ట వ్యతిరేక పరీక్షలు చేస్తే 50 వేలు జరిమానా, ఐదు సంవత్సరాల జైలు శిక్ష, మూడవసారి తప్పు చేస్తే కౌన్సిల్ నుండి పేరు తొలగిస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, చట్ట వ్యతిరేక పరీక్షల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిసిపి ఎన్‌డిటి యాక్ట్ జిల్లా నూడిల్ ఆఫీసర్ డాక్టర్ ఉషశ్రీ, డెమో దేవా శిరోమణి, మహిళా వైద్యులు నిలోఫర్ బేగం, చిన్నపిల్లల వైద్యులు నిసార్ అహ్మద్, ఖైరన్, లీగల్ అధికారి ఈ స్వాతి, పి సి ఎస్ ఎస్ స్వఛరేద సంస్థ వెక్తులు, ఎఎస్ఐ బాల కృష్ణయ్య,హెల్త్ ఎడ్యుకేటర్ బాలరామరాజు, ఉషారాణి, రాజగోపాల్ పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ఆరోగ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

మన దినసరి చర్యల్లో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మౌర్య కంటి ఆసుపత్రి సమీపంలో శుక్రవారం ఆయన షీ మహిళా యోగా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని పేర్కొన్నారు. మనిషి ఎన్నో ఒత్తిళ్లకు గురై మానసిక, శారీరక రుగ్మతలకు గురై రోగాల బారిన పడుతున్నాడని పేర్కొన్నారు. యోగా, ధ్యానంతో మానసిక, శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందటమే కాకుండా మంచి దేహదారుఢ్యం పొంది తద్వారా మనిషి ఆరోగ్యంగా, ఉల్లాసంగా జీవనం సాగించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పక ఉదయం, సాయంత్ర వేళల్లో అరగంట పాటు ధ్యానం, యోగా చేయాలని ఆయన సూచించారు. అలా చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు. యోగా కేంద్రం నిర్వాహకులు పివిఎస్ లక్ష్మీ, రాయల సుధాకర్ రాయలు దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు వివిఎన్ సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, వసంతాల రాజ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్


ఆస్పత్రిలో సెంటర్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.29 కోట్లతో మంజూరైన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి సంబంధించి ఆసుపత్రి వైద్యాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నూతన జిల్లాలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం చేపట్టడం ఎంతో శుభ పరిణామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేశారన్నారు. ఈ యూనిట్ నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం పూర్తయితే రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు, ఇతర అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు అధిక సంఖ్యలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి హాజరై మంత్రికి అర్జీలు సమర్పించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు రోల్ మోడల్‌గా ఉండి విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. అర్చన కళాశాలలో స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు నిర్వహిస్తున్న ఏడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మంత్రిని స్కౌట్ ఉద్యమంలోనికి ఆహ్వానిస్తూ స్కార్ఫ్‌ను ఆయనకు ధరింపజేశారు. స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు గార్డ్ ఆఫ్ హానర్ ద్వారా స్వాగతం పలికారు. అనంతరం స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులలో మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ, నైతిక విలువలు, మానవతా విలువలు పెంపొందడానికి స్కౌట్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ మౌలాలి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్ రెడ్డి, స్కౌట్ అధికారులు, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి నిత్యావసర సరుకులు అందిస్తున్న చిన్నయ్య

నిరుపేదకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని అయ్యలరాజుపల్లి గ్రామానికి చెందిన దాసరి సుబ్రహ్మణ్యం అనే నిరుపేద కుటుంబానికి పాణ్యం చిన్నయ్య, డాక్టర్ రమణ ఆధ్వర్యంలో నిత్యా వసర సరుకులు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో వర్షాలకు దెబ్బతిన్న ఇంటి మరమ్మతులకు చేసేందుకు హామీ ఇవ్వడం జరిగిందని పాణ్యం చిన్నయ్య తెలిపారు. బాధితుడు పక్షవాతం రావడంతో ఎటు వంటి పనిచేసుకోలేని స్థితిలో ఉన్నందున దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. నిత్యవసర సరుకులు బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దాసరి మని, నరసింహులు పాల్గొన్నారు.

ట్రిపుల్ఐటిల ప్లేస్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్గా సౌమ్యనాథ్

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని కదిరాయచెరువు గ్రామానికి చెందిన గౌరవం సౌమ్య నాథ్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిల ఇంటర్న్షిప్ ట్రైనింగ్, ప్లేస్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్గా నియమించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ స్థానానికి వివిధ రకాల పరీక్షలు, ఇంటర్వ్యూలు ఒంగోలులో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీ పరీక్షల్లో సౌమ్యనాథ్ సత్తాచాటి ఆ బాధ్యతలను దక్కించుకున్నారని అన్నారు. క్యాంపస్లోని విద్యార్థులకు మంచి అవకాశాలు తీసుకురావడంలో ముఖ్యంగా మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షించడం ద్వారా, ప్లేస్మెంట్స్, ఇంటర్న్షిప్లో వీరు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఈ బాధ్యతలు నెరవేర్చడానికి వారికి స్టైఫండ్తో పాటు ప్రత్యేక అలవెన్సులు కూడా లభిస్తాయి. ఈ సందర్భంగా సౌమ్యనాథ్ తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నియామక పత్రం అందుకుంటున్న సౌమ్యనాథ్

టూటౌన్ ఎస్ఐగా గాయత్రి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె రెండో పట్టణ ఎస్ఐగా గాయత్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న రవికుమార్ పిటిఎం మండలంకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మదనపల్లి టూటౌన్కు వచ్చినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పిఎస్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ముఖ్యంగా మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తె పారు. అనంతరం డిఎస్పి కొండయ్య నాయుడును కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు.

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం : టిడిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్బాషాపై నిరాధార ఆరోపణలు చేస్తే ఇక సహించమని, అటువంటి వారికి తగ్గిన బుద్ధి చెబుతామని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్జె.వెంకటేష్, టిడిపి మండలాధ్యక్షులు పురా వెంకటరమణ, మాజీ జడ్పిటిసి రెడ్డప్పరెడ్డి, సర్పంచు సుబ్రమణ్యం, ప్రసాద్ లు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ భాషా పై వస్తున్న నిరాదార ఆరోపణలను వారు ఖండించారు. అవినీతికి పాల్పడుతున్న మదనపల్లి తహశీల్దార్ను ఎమ్మెల్యే ప్రశ్నించడం జరిగిందన్నారు. తహశీల్దారే సాక్షాత్తు మాజీ ఎమ్మెల్సీ నరేష్కుమార్రెడ్డిని మామూలు అడగడం జరిగిందన్నారు. అదే విషయాన్ని ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే షాజహాన్బాషా దృష్టికి తీసుకురావడంతో ఆయన క్షుణ్ణంగా పరిశీలించి తహశీల్దార్ అవినీతికి పాల్పడుతుందని నిర్ణయించుకుని ప్రశ్నించామన్నారు. కొంతమంది తహశీల్దార్కు సహకరిస్తూ మంత్రి నారా లోకేష్ వద్ద ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారన్నారు. నిరాధార ఆరోపణలను చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డప్ప రెడ్డి, పుర్ర వెంకటరమణ, మల్లి కార్జున, సుబ్రమణ్యం, ప్రసాద్, చంద్రాయుడు, మేష రామకృష్ణ, మహేశ్వర్ రెడ్డి, రెడ్డప్ప పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు

విజయవంతంగా ముగిసిన పాలిటెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పాలిటెక్ ఫెస్ట్-2024 కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్, కలికిరి నందు జరిగిన పాలిటెక్ ఫెస్ట్ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలవిద్యార్థులు పాల్గొని వివిధ ప్రాజెక్టులను ఆవిష్కరణలను ప్రదర్శించారని అన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేయతులుగా ప్రొఫెసర్, ఇఇఇ శాఖ విభాగా ధిపతి కుమార్, డిఇఇ కరీముల్లా ఖాన్, వాసుదేవన్లు వ్యవహరించారని తెలిపారు. 298 మంది విద్యార్థులలో ప్రభుత్వ పాలి టెక్నిక్, కలికిరి డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 2 "ఎక్టోలైఫ్ : ది వరల్డ్ ఫస్ట్ ఆర్టిఫిషల్ వంబు ఫెసి లిటీ ఆవిష్కరణకు మొదటి విజేత, యస్వి. ప్రభుత్వ పాలిటెక్నిక్, తిరుపతి కళాశాలకు చెందిన డిప్లొమా ఇన్ సివిల్ ఇంజి నీరింగ్ విభాగ విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లడ్ రెసిస్టెంట్ ఫ్లోట్ హౌస్ ఆవిష్కరణకు రెండవ విజేతలుగా ఎంపికయ్యారు 20 ఉత్తమ ఆవిష్కరణలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఎంపికయిన మొదటి విజేతకు బహుమతిగా రూ. 25వేలు, రెండవ విజేతకు రూ.10వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఇఇఇ విభాగాధిపతి బి.సాంబశివారెడ్డి, జనరల్ సెక్షన్ విభాగాధిపతి డాక్టర్ పి.రఘు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాటూరు చెరువుకు నీరు తరలించే పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు చెరువుకు చెయ్యేరు నుండి నీరు తరలించే పనులను శుక్రవారం చేపట్టారు. చెయ్యేరు నుంచి చెరువుకు నీరు వచ్చే ఎగువ కాలువ పూడికతీత పనులను ఎక్స్వేటర్ సహాయంతో మొదలు పెట్టారు. ఈ పనులు పూర్తయిన వెంటనే చెరువు జలకలను సంతరిం చుకోనుంది. కన్యకా చెరువు కూడా నీరు అందించే పనులను చేపట్టాలని నాగిరెడ్డిపల్లె, నందలూరు పంచాయతీల ప్రజలు కోరుకుం టున్నారు. ఈ పనులు చేపట్టకపోతే ఏరులో నీరు వృథాగా వెళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టిని లోడుతున్న జెసిబి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

రాయచోటి : అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

బిఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతిని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. జాబీర్, మాదిగ దండోరా రాష్ట్ర కో-కన్వీనర్ యస్.రామాంజనేయులు, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యం.చెన్నయ్య సి.రాంబాబు గ్రీన్ అంబాసిడర్లు రెడ్డెయ్య, ప్రజా సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లా డుతూ రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని సదుపాయాలు కల్పించకపోతే వారు ఇప్పటికీ దారిద్ర్యంలో మగ్గిపోతు ఉండేవారని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో అమలులో ఉన్న రాజ్యాంగాలను అంబేద్కర్ పరిశీలించి భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు విధులతో ప్రజలందరూ శాంతి సౌభ్రాతృత్వం తో జీవిస్తున్నారని ప్రతి ఒక్కరు స్వేచ్ఛ, సమానత్వం తో జీవించడానికి రాజ్యాంగమే ప్రధాన కారణమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్లు ఆంజనేయులు, రవికుమార్, మాధవయ్య, రైతులు పామయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంబేద్కర్ వర్ధంతిని బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జ్యోతిచౌక్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు సింగన్న, సచిన్, బాస్ మండల కమిటీ అధ్యక్షులు కాట్నగల్లు రమణ, బి.కొత్తకోట మండల కమిటీ అధ్యక్షులు పలక వెంకటేష్, బాస్ నియోజకవర్గం నాయకులు కోగర మాధవ, బాస్ మండల నాయకులు కోగర వెంకటేష్ , సొట్ట గంగాద్రి, బిసి నాయకులు మహేష్, గంజి రోహిత్ పాల్గొన్నారు. **పీలేరు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు పీలేరులో వైభవంగా జరిగాయి. అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పీలేరు పట్టణంలో ఎంఆర్పిఎస్, భారతీయ అంబేద్కర్ సేన, మాలమహానాడు, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్, విద్యార్థి సంఘాలు వేర్వేరుగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎంఎస్పి పీలేరు నియోజకవర్గం నాయకులు గండికోట వెంకటేష్, బాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ముల్లంగి కృష్ణయ్య, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బలరాం తమ తమ కార్యవర్గాలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **వాల్మీకిపురం:** పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ దేశంలోని యువత అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు కేశవ రెడ్డి, ఇబ్రహిం, అబ్దుల్ కలీమ్, రఘు, శ్రీధర్రాయల్, నీళ్లభాస్కర్, రవి, సుధాకర్, చంద్రశేఖర్, విశ్వనాథ్, చికెన్మస్తాన్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు. **వీరబల్లి :** స్థానిక అంబేద్కర్ సర్కిల్లో ఉన్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనార్ధన్ రాజు, ఎస్సి సెల్ నాయకుడు సొరువు రాము, నాగార్జున పాల్గొన్నారు. **సుండుపల్లి:** రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి కెవి రమణయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివి రమణయ్య, దళిత నాయకులు పాల్గొన్నారు. **నందలూరు :** సర్పంచ్ల సంఘం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లిమేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మోడపోతుల రాము, నాయకులు వేల్పుల సైల కుమార్, ఎముక దుర్గయ్య, నాయనపల్లి ఆదినారాయణ, షేక్ మౌలా, మోడపోతుల సుధాకర్, పెనుబాల నాగసుబ్బయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష పిలుప ునిచ్చారు. అంబేద్కర్వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆర్టిసి బస్టాండ్ వద్ద మాల మహానాడు రాష్ట్ర నేత యమలా సుదర్శనం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ విద్యాసాగర్, పోతబోలు సుధాకర్, యమల సుదర్శనం, గుండాల మనోహర్, మల్లెల మోహన, శ్రీచందు, రూపక్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట: అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బాస్ నాయకులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఎమ్మెల్యే

మదనపల్లి: ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతులకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్బాషా పేర్కొన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లె గ్రామంలో ప్రత్యేక అధికారి డిఎఒ బాలకృష్ణారెడ్డి, తహశీల్దార్ ధనంజయలు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మీ భూమి-మీహక్కు అనే నినాదంతో రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. రైతే రాజు అన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వేల ఎకరాల ప్రజల భూములు అన్యాక్రాంతానికి గురి కావడంతో, రైతులు అనేక ఇబ్బందులను ఎదు ర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రతి గ్రామంలో నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 45 రోజుల్లో రైతు సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపిఒ బాలకృష్ణారెడ్డి, తహశీల్దార్ ధనంజయులు, సర్పంచు శ్రీవాణి నవీన్, టిడిపి నాయకులు ఆర్.జె వెంకటేష్, మల్లికార్జున, రాజన్న, పుర్రా వెంకటరమణ, రెడ్డప్పరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్రావు, శ్రీపతి, మేష రామకృష్ణ, మల్లప్ప, దేవేంద్ర రెడ్డి, ఎంపిడిఒ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్, అటవీ శాఖ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. **గాలివీడు:** రెవెన్యూ సదస్సుకు 63 దరఖాస్తుల అందినట్లు తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. 53 దరఖాస్తులు రెవిన్యూ కి సంబంధించినవని, మిగతా దరఖాస్తులు హౌసింగ్, పింఛన్కు చెందినవని తెలిపారు. ప్రజలందరూ ఈ రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవా లని ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డిటి. శ్రీధర్రెడ్డి, వెలిగల్లు సర్పంచ్, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మండలంలోని మూగల మర్రి, ఆరమడక గ్రామాలకు సంబంధించి మూగలమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పామిలేటి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలు, రైతుల సమస్యలను తెలుసుకొని, వారి వద్ద నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిటి వెంకట్, ఆర్ఐ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **నందలూరు:** రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులు, ముటేషన్, నదులు, చెరువులు, కాలవ ఆక్రమణలు, తోపాటు ఇంటి, భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూప రెడ్డి, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, శీను, స్పెషలాఫీసర్ ముజీబ్ భాష, తహసిల్దార్ అమర్నాథ్, పంచాయతీ సెక్రెటరీ మమత, జూనియర్ అసిస్టెంట్ సిద్దిక్, మండల సర్వేయర్ ప్రభాకర్, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలోని భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, మండల నోడల్ ఆఫీసర్ గోపీనాథ్ తెలిపారు. ఎద్దుల వారి పల్లె గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. ప్రజల నుండి సుమారు 16అర్జీలు వచ్చాయని, అందులో రెవెన్యూ కు సంబంధించి 5,పెన్షన్ కోసం 11 ఆర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ హరి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ ఉదయ్కిరణ్రెడ్డి, ఆర్ఐ ముద్దుకృష్ణ యాదవ్, మండల సర్వేయర్ నరేంద్ర, ఫారెస్ట్ ఇఒ రామ్రాజ్, దేవాదాయ శాఖ నుంచి కొండ కిట్ట, విఆర్ఒ వెంకటేష్ పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరి సచివాలయం-3 పరిధిలో తహశీల్దార్ మహేశ్వరి బాయ్, టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. రెవెన్యూ సదస్సుకు 29 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జయ ప్రకాష్, ఇఒ అశోక్, సర్పంచ్ ఆర్.ఎల్లయ్య, టిడిపి ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, టిడిపి నాయకులు సనవుల్ల, వైజాగ్ భాషా, సర్వేయర్ రెడ్డప్ప, విఆర్ఒలు, ప్రజలు పాల్గొన్నారు. **రామాపురం :** రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు వాటిని తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని రామపురం తహశీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని గోపగుడిపల్లి సచివాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో రైతులు తమ భూమి సమస్యలు ఆన్లైన్లో ముటేషన్లు ఎక్కువగా అర్జీలు రైతుల నుంచి వచ్చాయని అన్నారు. మొత్తం 100 పైగా రైతులు భూ సమస్యలతో కూడిన అర్జీలను సదస్సులో ఇచ్చారని వాటిని త్వరగా పరిష్కరిస్తామని అన్నారు.అర్హులైన రైతులను గుర్తించి వారికి ఆన్లైన్, ముటేషన్ చేయిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మనీ. ఎండోమెంట్ డివిజనల్ ఇన్స్పెక్టర్ శివయ్య, గ్రామ నాయకులు చంద్రమౌళి, తిమ్మారెడ్డి, రేఖం ఆంజనేయులు, రేఖం శివ, చిట్టి రెడ్డయ్య ముంగర సుబ్బయ్య. సుధాకర్ ఈశ్వరయ్య, గ్రామ సచివాల సిబ్బంది పాల్గొన్నారు. **రామసముద్రం :**రామసముద్రం మండల కేంద్రంలో తహశీల్దార్ నిర్మాలదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవె న్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్ర మాన్ని ప్రారంభించారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ చేసి అజ్జీదారునికి రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్నస్వామి, సీతా రామస్వామి, రాజేష్స్వామి, శంకర్నాయుడు, మాజీ ఎంపిటిసి చలపతి నాయుడు, మాల మహానాడు మండల అధ్యక్షలు కిట్టా, ఎంపిడిఒ భానుప్రసాద్, బాలాజీ, పంచాయతీ కార్యదర్శి మునస్వామి నాయక్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్, అటవీ శాఖ, పోలీసు అధికారులుపాల్గొన్నారు.

నందలూరు: అర్జీని పరిశీలిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పన : 'చమర్తి'

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జగన్మోహన్రాజు

ప్రజాశక్తి-వీరబల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేస్తోందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని డి.రాచపల్లి, వంగిమళ్ల, పెద్దూరు కస్పా, వనం కాడపల్లి, మాలపల్లిలో టిడిపి మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు, టిడిపి నాయకులు ప్రసాద్రాజు, రామ్మోహన్రెడ్డి, ప్రతాప్రెడ్డిఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాజంపేట నియోజ కవర్గం లోని ప్రతి పల్లెలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిది ద్దేందుకు కృషి చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేసి ప్రజలను అధో గతిపాలు చేసిం దంటూ ఆరోపించారు. పల్లెపండుగ పేరుతో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్, మంత్రి నారాలోకేష్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయ నించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రెడ్డప్పరెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్, ఎఇలు నాగూర్ మీరా, ఇర్ఫాన్, సొసైటీ ప్రెసిడెంట్ రామ్మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ రాజు, చిన్నమల్లయ్య యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గండి మడుగులో సమీపంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ పేర్కొన్నారు. గండి మడుగులో లోతు ఎక్కువగా ఉన్నదని ఈత రాని వారు, పిల్లలు కానీ ఇక్కడికి రాకూడదని హెచ్చరిక బోర్డులో పొందుపరిచారు. ప్రతి ఒక్కరూ ఈ హెచ్చరిక బోర్డును గమనించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గండిమడుగు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివా సులు హెడ్ కానిస్టేబుల్ ఈశ్వర్నాయక్, పూజారి పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. 391 మంది రైల్వే కార్మిక ఓటర్లలో మొదటిరోజు 214, రెండవ రోజున 117, మూడవ రోజున 15 మంది మొత్తం 346 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడి బ్యాలెట్ బాక్స్లను గుంతకల్లుకు తరలించనున్నారు. ఈ ఎన్నికలకు పోలింగ్ అధికారిగా మధుసూదన్రావు, పోలింగ్ సూపరిండెంట్ శివలింగం, పోలింగ్ అసిస్టెంట్గా లక్ష్మి నారాయణ వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆర్ పి ఫ్ ఎస్ .ఐ . త్రివేణి, జిఆర్పి. ఎస్ఐ శ్రీనివాసరావు, స్థానిక ఎఎస్ఐ శంకర్ నాయక్, జిఆర్పి పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 17 రైల్వే జోన్లలో జరిగే ఎన్నికలలో ఐదు కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయి. 35 శాతం ఓట్లు వచ్చిన యూనియన్లకు గుర్తింపు లభించనుంది.

ప్రాథమిక పాఠశాలలో క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు, తహశీల్దార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తల్లిదం డ్రులు, మండల అధికారులు ఉపాధ్యాయులు మల్లికార్జున, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నరేష్ కుమార్రెడ్డి (ఫైల్ ఫొటో)

దామోదర్రెడ్డి (ఫైల్ ఫొటో)

మదనపల్లె సమీపంలోని కదిరి రోడ్డు, అమ్మచెరువు మిట్ట ఎసి గోడౌన్ వద్ద శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని తప్పించ బోయే క్రమంలో అదుపు తప్పిన బైకు డివైడర్ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట మండలం, తుమ్మనగుట్ట పంచాయతీ, బండమీదపల్లికి చెందిన నరేష్ కుమార్ రెడ్డి(25), మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె మాయాబజారుకు చెందిన దామోదర్రెడ్డి (25), మహేందర్ కలిసి కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని కెఎన్ఆర్ కల్యాణ మండపంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లారని తెలిపారు. వివాహానంతరం ముగ్గురు యువకులు కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయల్దేరారని చెప్పారు. మార్గ మధ్యంలోని అమ్మచెరువు మిట్ట ఎసి గోడౌన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న నరేష్ కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, దామోదర్రెడ్డి, మహీందర్లు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన బాధితులను 108 లో స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిం చారని తెలిపారు. వీరిలో చికిత్స పొందుతూ దామోదర్ రెడ్డి మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మహేందర్ను తిరుపతికి రెఫర్ చేశారని తెలిపారు. దామోదర్ రెడ్డికి ఏడాదిక్రితమే వివా హమైంది. ఇతనికి భార్య అమృత, పదిరోజుల పసిపాప ఉంది. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకుని బోరున విలపిం చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ : ఇద్దరికి గాయాలు

బాధితులను ఆస్పత్రికి తరలించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గమనించిన మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వారిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. కురబలకోట మండలం, సర్కారుతోపు వద్ద శుక్రవారం కారు, ట్రాక్టర్ ఢీకొని బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇదే సమయంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ బి.కొత్తకోట మండలం, బీరంగిలో జరుగుతున్న గ్రామ సభలకు హాజరై తిరిగి మదనపల్లెకు వస్తుండగా ప్రమాదాన్ని గమనించారు. గాయపడ్డ క్షత గాత్రులను తానే దగ్గరుండి మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రమాదం వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ 108 డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డు లోని రెండో మలుపు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 108 డ్రైవర్ రమేష్బాబు (35) శుక్రవారం చికిత్స పొందుతూ కడప రిమ్స్లో మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం, శంకరాపురం గ్రామానికి చెందిన ఎస్ రమేష్ బాబు 108 వాహనంలో డ్రైవర్ గాపని చేస్తున్నాడు. కడపలో 108 వాహనం మరమ్మతులు చేయించుకుని తిరిగి వాహనంలో ములకలచెరువుకు వస్తూ ఉండగా గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో రెండవ మలుపు వద్దకు రాగానే ఆవులు రోడ్డుకు అడ్డంగా రావడంతో వాటిని తప్పించబోయి సైడ్ ఉన్న డివైడర్ కొండను ఢీకొంది. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్కు తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతునికి రెండు సంవత్సరాల క్రితం వివాహం అయింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

108 ఎంప్లాయిస్ యూనియన్ ఆర్థిక సాయం

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్ కుటుం సభ్యులకు 108 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.40వేలు ఆర్థిక సాయం చేశారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ వి.రమణ, జిల్లా సెక్రటరీ చలపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జస్వంత్ మృతుడి భార్య అనూష, కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందించారు.రమేష్ మృతి భాదకరమని వారి కటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.